క్లుప్తంగా

అచ్చమాంబకు పొంగళ్ల సమర్పణ

మర్రిపాడు : మండలంలోని పొంగూరు మాలి చేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద భక్తులు ఆదివారం పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి వెంకటేశ్వర్లు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

కావలి : పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కామంచి వీరకృష్ణ అనే పదేళ్ల నిరుపేద చిన్నారి ఆరోగ్యం బాగోలేక ఇబ్బందులు పడుతోంది. దీనిని గుర్తించిన స్థానిక బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.10 వేల నగదును చిన్నారి కుటుంబసభ్యులకు వితరణగా అందజేశారు.

చీరల పంపిణీ



అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని రాజవోలు గ్రామంలో ఈఎంసీ చర్చి ఆధ్వర్యంలో పేద మహిళలకు ఆదివారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.సుధీర్‌బాబు మాట్లాడుతూ పేద మహిళలకు చీరలు అందజేసి ఆదుకోవాలన్నదే ఈఎంసీ చర్చి లక్ష్యమని తెలిపారు. గతంలో ఏఎస్‌పేట పరిసర గ్రామాల్లో నిరుపేదలకు అనేక రకాల సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.ప్రసాద్, ప్రేమలత, నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



కావలి రూరల్ : పట్టణంలోని బుడంగుంట గిరిజన కాలనీలో పేద పిల్లలకు సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, బిర్యానీ ప్యాకెట్లను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పట్టణానికి చెందిన గుల్లపల్లి నాగేంద్రబాబు, పిల్లి డేవిడ్ ప్రియకుమార్ తమ పుట్టిన రోజును పేదల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు.

ఉత్సవాలు ప్రారంభం



అంకాలమ్మతల్లి దేవస్థానం

వింజమూరు : గుండెమడకలలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మతల్లి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చి జలాధివాసం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కావలి రూరల్ : ఓ వ్యక్తిపై మరో వ్యక్తి రాయితో దాడికి పాల్పడిన ఘటన కావలి రూరల్ మండలం మద్దూరుపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకటరావు సమాచారం మేరకు.. పులుసు రవికుమార్ అనే వ్యక్తి గ్రామంలోని శ్రీహరి, మాగాణి కిశోర్‌తో మాట్లాడుతుండగా వేలూరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వచ్చి రవికుమార్‌ను దూషించాడు. దీనిపై అతను ప్రశ్నించగా వెంకటేశ్వర్లు రాయి తీసుకుని రవికుమార్‌పై విసిరాడు. దీంతో అతని కంటి వద్ద రక్త గాయమైంది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీకాంత్ విజయానికి కృషి చేద్దాం



ఆత్మకూరు : తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ మద్దతుతో పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ ముఖ్య నేతల తీరుపై వాదోపవాదాలు చేసుకున్నారు.

వదలని ప్లాస్టిక్ భూతం

- నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఇళ్ల మధ్య ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

అల్లూరు : పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్న ప్లాస్టిక్ కవర్ల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రజల అవగాహనా రాహిత్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. నగరాలు, పట్టణాలే కాకుండా పచ్చటి పల్లెలకు సైతం ప్లాస్టిక్ వినియోగం విస్తరిస్తోంది.

అమలు కాని నిబంధనలు

అల్లూరు మండల పరిధిలో ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగుల అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా జోరుగా సాగుతున్నాయి. 40 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న క్యారీ బ్యాగులను ఉపయోగించరాదని నిబంధనలు ఉన్నా అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.

పలుచని కవర్లలో ఆహారం

పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న హోటళ్లు, దుకాణాల్లో ప్లేట్లలో ఆకులకు బదులు పలుచని ప్లాస్టిక్ కవర్‌ను వినియోగిస్తున్నారు. దీనివల్ల వేడి ఆహార పదార్థాలు వేసినప్పుడు ప్లాస్టిక్ కవర్‌తో కరిగి శరీరానికి చేరుతుందని, దీంతో అనారోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. పలు రకాల కేన్సర్లు, అల్సర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు ప్లాస్టిక్ వాడకం కారణంగానే వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. హోటళ్లు, దుకాణాలే కాకుండా ఏ వ్యాపారంలోనైనా ప్లాస్టిక్ వాడకం సర్వసాధారణం కావడంతో సమస్య నానాటికీ తీవ్రమవుతోంది.

పర్యావరణానికి ముప్పు

విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం కారణంగా పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. వివాహాది శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు అధికంగా వాడుతుండటంతో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతున్నట్లు చెబుతున్నారు. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్ల వెంబడి, వీధుల్లో గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లు తిని మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి.



బస్టాండ్ సెంటర్ ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అవగాహన కల్పించాలి



ప్లాస్టిక్ వినియోగం కారణంగా ప్రజలకు కలిగే నష్టాలు, వచ్చే ఆరోగ్య సమస్యలు, పర్యావరణానికి కలిగే హాని గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. తద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించవచ్చు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మేము కూడా కృషి చేస్తాం.

– కొప్పు శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అల్లూరు

ప్లాస్టిక్‌తో పలురకాల కేన్సర్‌లు



ప్లాస్టిక్ వినియోగం కారణంగా ప్రజలకు పలు రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు జీర్ణకోశ వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి.

– బత్తల సుధాకర్, అల్లూరు

చర్యలు తప్పవు



ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో నిబంధనలు తప్పక పాటించాలని నగర పంచాయతీలోని దుకాణదారులకు పలుమార్లు సూచించాం. అయినప్పటికీ తీరు మారని దుకాణదారులపై తప్పక చర్యలు తీసుకుంటాం. త్వరలో జరిమానాలు విధిస్తాం. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నివారిస్తాం.

– ఫణికుమార్, కమిషనర్

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

- జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలించిన కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో జల్‌జీవన్ మిషన్ కింద జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అన్నగారిపాళెంలో ఉన్న తాగునీటి పథకం నుంచి తుమ్మలపెంట గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోంది. అయితే నీటి లభ్యత తక్కువగా ఉండటంతో తుమ్మలపెంట ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.కోటి నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ క్రమంలో పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ



మర్రిపాడు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి



వింజమూరు పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు

మర్రిపాడు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మర్రిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం మండల ఎన్నికల అధికారి లక్ష్మణనాయక్ పరిశీలించారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని ఎన్నికలాధికారి పేర్కొన్నారు. ఇక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలోని సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట వీఆర్వోలు హజరత్, తిరుమలరావు పాల్గొన్నారు.

- **వింజమూరు** : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవీంద్రబాబు ఆదివారం పరిశీలించారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, మౌలిక వసతులపై ఆరాతీశారు. ఆర్‌ఐ సిరాజ్, అధికారులు పాల్గొన్నారు.
- **ఉదయగిరి** : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉదయగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సానా శ్రీనివాస రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు.

అన్నిరంగాల్లో మహిళలు ముందంజ



మాట్లాడుతున్న ప్యానెల్ అడ్వొకేట్ శేషారెడ్డి



పాల్గొన్న విద్యార్థినులు

ఆత్మకూరు : ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నట్లు న్యాయవిజ్ఞాన సదస్సు ప్యానెల్ అడ్వొకేట్ కేవీ శేషారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ శారదా అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్బంధ విద్యతో బాలికల్లో విద్యాశాతం పెరిగిందన్నారు. ఇప్పటినుంచే బాలికలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్వొకేట్ సింధూర, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు వీహెచ్‌పీ కృషి

కావలి : దేశంలో హిందూ ధర్మ పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ నిరంతరం కృషి చేస్తోందని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి చెప్పారు. కావలిలో ఆదివారం జరిగిన వీహెచ్‌పీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో వార్డు వీహెచ్‌పీ కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈనెల 12 నుంచి 19 వరకు దేశ వ్యాప్తంగా హిందూ శ్మశానవాటికలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ ఆదిలక్ష్మి

వింజమూరు : విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ ఏఎస్‌డబ్ల్యూఓ కె.ఆదిలక్ష్మి తెలిపారు. కావలి డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు వింజమూరులో ఆదివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు.

నెల్లూరుకు వెళ్లి పింఛన్ అందజేత



శంకరమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

ఆత్మకూరు : పట్టణంలోని ఏసీఎస్సార్ కాలనీకి చెందిన ఎస్.శంకరమ్మ అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. దీంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమణారెడ్డి ఆదివారం నెల్లూరుకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె వద్ద వేలిముద్ర తీసుకుని పింఛన్ నగదును అందజేశారు. శంకరమ్మతో పాటు బంధువులు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కావలి : పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రికెట్ బ్యాట్‌తో మైదానంలో కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ తరఫున రూ.25,000 నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతుల మీదుగా, దివంగత మాజీ మంత్రి కలికి యానాది రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.10,000 నగదు బహుమతిని వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కుందుర్తి కామయ్య, షేక్.షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

కలిగిరి : కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి బుధవారం వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, హోమాలు జరుగుతాయి. మంగళవారం గ్రామోత్సవం జరుగుతుంది. బుధవారం విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ శాంతి కల్యాణం జరుగుతుంది. అర్చకులు అప్పసముద్రం చంద్రశేఖరాచార్యులు చేతుల మీదుగా కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



ఆత్మకూరు : ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కావలి : బ్యాలెట్ నమూనా పత్రాన్ని అందజేస్తున్న నేతలు



అనుమసముద్రంపేట : ఓటర్లను అభ్యర్థిస్తున్న నాయకులు

జలదంకి : వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి కోరారు. మండలంలోని కమ్మవారిపాళెం, చామదల, కృష్ణపాడు, సోమవరప్పాడు, కొత్తపాళెం పంచాయతీల్లో ఆయన ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తమ్మినేని సతీష్‌నాయుడు, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి అమరావతి, వైఎస్సార్‌సీపీ నేతలు వంటేరు లక్ష్మీనరసారెడ్డి, పసుపులేటి ప్రసాద్, బిజ్జం ఎరుకలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్లపాడు, వీర్నకొల్లులో..

కలిగిరి : మండలంలోని తెల్లపాడు, వీర్నకొల్లు పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మద్దతుగా స్థానిక నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పార్టీ నేతలు పాలూరు కొండారెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా..

అనుమసముద్రంపేట : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఏఎస్‌పేట మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేసీఎస్ కో–ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి ఆదివారం ఇంటింటికి తిరిగి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు రియాజ్ అహ్మద్, ఎం.రామిరెడ్డి, ఎం.శేషాద్రి, ఎం.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా..

చేజర్ల : తూర్పు రాయలసీమ వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపుకోసం మండలంలోని మాముడూరు, కాకివాయి గ్రామాల్లో ఆదివారం నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీర రాఘవరెడ్డి, నాయకులు ఎస్.నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రజనీకాంత్, సచివాలయ కన్వీనర్లు జయంత్‌రెడ్డి, జి.ప్రసాద్‌రెడ్డి, బి.మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పట్టణంలో..

ఆత్మకూరు : ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు ఆత్మకూరు పట్టణంలో ఆదివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకట రమణమ్మ, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, టి.తిరుపతమ్మ, పి.పెంచలయ్య, ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, ఎన్.శీనయ్య, కె.వెంకటేశ్వర్లు, టి.మణి, కె.వెంకటేశ్వర్లు, వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెంచుగానిపాళెంలో..

కావలి : మండలంలోని చెంచుగానిపాళెంలో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం చేశారు. ఓటర్లకు బ్యాలెట్ నమూనా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులుగౌడ్, సచివాలయాల మండలం కన్వీనర్ నాగనగారి శ్రీనివాసులు, నేతలు తిరుపతి, బాబు, పెదరాయుడు, పోసిన వెంకట్రావుగౌడ్ పాల్గొన్నారు.

- **ఆత్మకూరురూరల్** : మండలంలోని కరటంపాడులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు పఠాన్ ఖాసీం ఖాన్, రఫీ, ఉస్మాన్ ఖాన్ పాల్గొన్నారు.
- **వింజమూరు** : మండలంలోని చాకలికొండ, జనార్ధనపురం, కాటేపల్లి, రావిపాడు, ఊటుకూరు, నందిగుంట పంచాయతీల పరిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి రాజారావు, స్థానిక నేతలు ఎ.నరసింహారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయకృష్ణారెడ్డి, రాయుడు, చైతన్య రెడ్డి, నరేష్, కాజారెడ్డి పాల్గొన్నారు.



జలదంకి : కమ్మవారిపాళెంలో ప్రచారం చేస్తున్న నాయకులు



వింజమూరు : ప్రచారం చేస్తున్న నాయకులు



చేజర్ల : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



ఆత్మకూరురూరల్ : కరటంపాడులో..



కలిగిరి : తెల్లపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు